క్లుప్తంగా

నేడు బెజ్జంకిలో మంత్రి హరీశ్‌రావు పర్యటన

బెజ్జంకి(సిద్దిపేట): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం బెజ్జంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమానికి, అనంతరం నిర్వహించే భారీ బహిరంగ సభకు మంత్రి హరీశ్‌రావు హాజరవనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్ కుమార్, సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సిద్దిపేట జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ హాజరవుతారన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈటలను కలిసిన నేతలు


ఈటలతో బీజేపీ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేపీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గర్నెపల్లి కృష్ణమూర్తి, సీనియర్ యూత్ నాయకుడు రమేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బీఆర్‌ఎస్ చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని ఈటల వారికి సూచించినట్లు తెలిపారు.

పాఠ్యపుస్తకాల గది సీజ్


గదిని సీజ్ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

హుస్నాబాద్: నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాల యాజమాన్యం యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంఈఓ ఆదేశాల మేరకు విద్యాశాఖ సిబ్బంది పాఠ్య పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిత్య, ఏబీవీపీ నగర కార్యదర్శి రాకేష్, నాయకులు చరణ్, మణిదీప్, వికాస్, ఇలియాస్ పాల్గొన్నారు.

డబ్బులు త్వరగా జమచేయాలి


మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొముురవెల్లి(సిదిపేట): ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డబ్బులు ఆలస్యమవడంతో వానాకాలం పంటకు పెట్టుబడికి చిల్లిగవ్వ లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు త్వరగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు నీల భిక్షపతి, వుల్లంపల్లి సాయిలు, ఆరుట్ల రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

కొండపాక(గజ్వేల్): ఇటీవల మృతిచెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థిని లిఖిత కుటుంబాన్ని శుక్రవారం ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. లిఖిత కుటుంబానికి రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లేకుంటే ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అభి, మండల అధ్యక్షుడు కుంచెం రవి, నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి కపిల్, ములుగు, గజ్వేల్ మండలాల అధ్యక్షులు కోల హరీష్, నీరుడి హరీష్, నాయకులు సాయి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డా.శ్రీనివాస్

రాయపోలు(దుబ్బాక): సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.శ్రీనివాస్ అన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదంటూ 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన శుక్రవారం రాయపోలు పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయిలో మెరిసిన హుస్నాబాద్

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: అభివృద్ధిలో హుస్నాబాద్ జాతీయ స్థాయిలో మెరిసిందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్తమ సేవలు అందించిన అధికారులు, కార్మికులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రగతితో తెలంగాణలోని పట్టణాల రూపురేఖలు మారాయని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తున్నామని, జాతీయ స్థాయిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా అవార్డులను కైవసం చేసుకున్నామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఇండోర్ స్టేడియం, డిగ్రీ కళాశాల, ఉమెన్స్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హాస్టల్, టీటీసీ భవనం, డయాలసిస్ సెంటర్, ఓపెన్ జిమ్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటయ్యాయన్నారు. అనంతరం బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.2కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, రమాదేవి, పెరుక భాగ్యరెడ్డి, గోవిందు రవి, వాల సుప్రజ, కో ఆప్షన్ సభ్యులు అయూబ్, శ్రీలత, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శంగా కంటి వెలుగు

కొండపాక(గజ్వేల్): కంటి వెలుగు పథకం దేశంలో ఆదర్శంగ నిలుస్తుందని జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. అంధత్వ రహిత సమాజం కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని, గ్రామీణ ప్రాంత ప్రజలు దీనిని చక్కగా వినియోగించుకున్నారని అన్నారు. రెండో విడత విజయవంతంగా పూర్తి అయ్యేందుకు సహకరించిన వైద్య సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్ముల రమేష్, అడిషినల్ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్,


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కాశీనాథ్

క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ రాకేష్, ఏఎస్ఎంలు సమత, అర్చన, హరీష్, నాగమణి, లావణ్య, అమీదా, ఝాన్సీలక్ష్మి, ఆశవర్కర్లు చంద్రకళ, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, విజయలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): దుర్గమాత దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో నిర్వహించిన దుర్గమాత ఉత్సవంలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో అరిష్టాలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, ఎంపటీసీలు గుజ్జుక సమ్మయ్య, నర్సింహులు, నాయకులు బర్మ రాజమల్లయ్య, తాళ్లపల్లి భిక్షపతి పాల్గొన్నారు.

గండిపెల్లిని ఎప్పుడు పూర్తి చేస్తారు?


మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 16 ఏళ్లు పడితే గండిపెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఎన్ని ఏళ్లు పడుతుందని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి ప్రశ్నించాడు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేటను వంద ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న మంత్రి హరీశ్‌రావు, హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవంలేదని ఆరోపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు 4వేల ఎకరాలు సేకరిస్తే, 8వేల ఎకరాల భూమిని సేకరించినట్లు తప్పుడు లెక్కలు చూపించి, పరిహారాన్ని దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు, జంగపల్లి అయిలయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, పున్న లావణ్య, నాయకులు హుస్సేన్, వెన్న రాజు, పున్న సది, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధన ప్రారంభం


డిజిటల్ స్క్రీన్ బోర్డుతో బోధిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రం భూంపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు డిజిటల్ స్క్రీన్ ద్వార విద్యా బోధన ప్రారంభించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు మంజూరైన డిజిటల్ బోర్డుల ద్వారా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు బోధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు దయాసాగర్ రెడ్డి, రవి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భాగ్యమ్మ, పద్మావతి, భూపాల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామంలో కావేరి సీడ్స్ భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను శనివారం మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేయనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పాములపర్తిలో 35 డబుల్ బెడ్‌రూమ్‌లను లబ్ధిదారులకు అందిస్తారని, కాలనీకి కేసీఆర్ కాలనీగా నామకరణం చేశామన్నారు. గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ఘనంగా అన్నాభిషేకం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాసశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం మల్లికార్జునుడికి అన్నాభిషేకం నిర్వహించినట్లు విజయదుర్గ ఉపాసకుడు చెప్పెల హరినాథ శర్మ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు రాహుకాలార్చన పూజ, నిమ్మ డొప్పలలో దీపాలు వెలిగించినట్లు తెలిపారు. రాహుదోశ నివారణ కోసం దుర్గాదేవికి విశేకష పూజలు, కేతు గ్రహ దోష నివారణకు గణపతి అర్చన నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వేద పండితులు లక్ష్మణరావు, క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు చిటుకుల నర్సింహ్మారెడ్డి, మర్యాల రవీందర్, చీకోటి మల్లికార్జున్, రాజేంద్రప్రసాద్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని రామాలయ 33వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తీగుళ్ల రామ్మూర్తి శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశస్థాపన, అఖండ దీపారాధన, సీతారామచంద్ర స్వామి అభిషేకం, రుద్ర చండీయగం సీతారామ చంద్ర కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంఠరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఆలయ


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కమిటీ నిర్వాహకులు బుస్సా బాలయ్య, అర్చకులు తిరుపతియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన బోధన అందుతుందని సర్పంచ్ పాల్కంపల్లి జయంతి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్యతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. మన ఊరు మన బడి కింది పాఠశాలల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి


పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయంతి

నరేందర్, హెచ్‌ఎం బాలకృష్ణ, నాయకులు సంపత్, నాగరాజు, నరేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ సొమ్ము వసూళ్లపై నిర్లక్ష్యం

కొముురవెల్లి(సిద్దిపేట): కొముురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించే టెండర్ల డబ్బులను వసులూ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. టెండర్ దారులు ఆలయానికి డబ్బులు చెల్లించకుండా తప్పించుకుంటున్నా పట్టించుకోవడంలేదు. 2022-23 సంవత్సరానికి గాను గతేడాది జూన్‌లో వివిధ విభాగాలకు టెండర్లు నిర్వహించారు. నిబంధన ప్రకారం జూన్ 9, 2023 వరకు పూర్తి డబ్బు చెల్లించాలి. డబ్బులు చెల్లించకపోతే టెండర్ రద్దు చేసి కొత్త టెండర్ నిర్వహించే అధికారం ఆలయ అధికారులకు ఉన్నా.. వసూళ్లపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతేడాది తలనీలాలు పోగు చేసుకునే హక్కును దక్కించుకున్న టెండర్ దారుడు ఆలయానికి రూ.6,17,000, సులభ్ కాంప్లెక్స్ టెండర్‌దారుడు రూ.52వేలు, కోరమీసాల టెండర్ దారుడు రూ.1,89,000, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోనేందుకు రూ.21,216, వస్త్రములు పోగు చేసుకునే టెండర్‌దారుడు రూ.1లక్షలు చెల్లించాల్సి ఉంది. 10 రోజుల్లో కాల పరిమితి ముగియనుండగా ఇప్పటివరకు టెండర్ సొమ్మును వసూలు చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఆలయ చైర్మన్‌గీస భిక్షపతిని వివరణ కోరగా.. గతేడాది టెండరుల దక్కించుకొని డబ్బు చెల్లించనివారు ఈ ఏడాది టెండర్‌కు అనర్హులుగా ప్రకటిస్తామని తెలిపారు.

వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం

ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందిస్తూ 24గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులు సాగుచేసిన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తున్నామని, రైతుబంధు, రైతుబీమా పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్, మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, ఏవో నాగరాజు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన పాలకవర్గ సభ్యులు

పట్టణ ప్రగతితో కాలనీల అభివృద్ధి


ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ప్రగతితో కాలనీలు అభివృద్ధి చెందాయని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. పారిశుధ్య సిబ్బందికి ఆప్రాన్, టోపీలు, బ్లౌజులు, ఉత్తమ కౌన్సిలర్లలకు ప్రశంస పత్రాలు అందించారు. పట్టణంలో నీటి సరఫరా, అంతర్గత రోడ్లు, మురికి కాల్వలు, అర్హులకు అందుతున్న పెన్షన్లపై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, యాట కనకమ్మ, జుబేదా ఖతూన్, నాయకులు వెంకట్‌రెడ్డి, రంజిత, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం


దుబ్బాకలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత


గజ్వేల్‌లో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాకను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. పట్టణ ప్రగతి దినోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించారు. సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి మున్సిపల్ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పోచమ్మ ఆలయం సమీపంలో మానవహారం నిర్వహించి, సఫాయి కార్మికులకు శాలువా కప్పి ప్రశంస పత్రాలతో సన్మానించారు.

గజ్వేల్: పట్టణ ప్రగతితో మంచి ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ జకియొద్దీన్, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందిని సన్మానించి, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధి ఆంజనేయులు కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలను ఎర్త్ ఫౌండేషన్ దత్తత తీసుకుందని, విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దడానికి వ్యాయామ ఉపాధ్యాయుడు, డాన్స్ మాస్టర్‌ని నియమిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఆటలు, యోగా, డాన్స్‌లో శిక్షణ అందిస్తామన్నారు. ముగ్గురు విద్యా వలంటీర్ల పర్యవేక్షణలో క్రీడా సామగ్రి, దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి బాలాగౌడ్, హెచ్‌ఎం భిక్షపతి, ఉపాధ్యాయులు కరుణాకర్, శ్రీనివాస్, శ్రీ విద్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మట్లాడుతున్న ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధి ఆంజనేయులు

సంక్షిప్త వార్తలు

◆ **ఆరుగురు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి**

సిద్దిపేట కమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ 2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మిరుదొడ్డి ఎస్‌ఐ పల్లె శ్రీధర్‌గౌడ్, బెజ్జంకి ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్, గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్, దుబ్బాక ఎస్‌ఐ మహేందర్, ములుగు ఎస్‌ఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ తోట లింగంలు సీఐలుగా పదోన్నతి పొందినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

◆ **ఆలయానికి విరాళం**

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి పోచమ్మ ఆలయ అభివృద్ధికి వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైతే విరాళం అందిస్తానని మొక్కుకున్నానని, దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి విరాళం అందించినట్లు తెలిపారు. ఆయనతో ఎంపీపీ లత, సర్పంచ్ లత, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మజీద్‌పల్లి ఆలయ అభివృద్ధికి పీసీసీ డెలిగేట్ సభ్యుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి రూ.20వేలు అందించారు.

◆ **బీజేపీ నుంచి వేణుగోపాల్‌రెడ్డి సస్పెండ్**

హుస్నాబాద్: బీజేపీ పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కవ్వ వేణుగోపాల్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తెలిపారు. 6 నెలల క్రితం పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసిందని, ఎంపీ బండి సంజయ్ పర్యటన నేపథ్యంలో అనుచిత వ్యాఖ్యలు చేసి పార్టీని అప్రతిష్ట పాలు చేయడంతో పార్టీ సభ్యత్వం రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

◆ **నోటుబుక్స్ అందజేత**

వర్గల్(గజ్వేల్): మండలానికి చెందిన దంపతులు శ్యాంసుందర్‌రెడ్డి కిరణ్మయిల కుమారుడి ఆశ్రిత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు అందించారు. శుక్రవారం వేలూరు జెడ్పీహైస్కూల్‌లో 320 మంది, ప్రైమరీ స్కూల్‌లో 151 మంది, సీతారాంపల్లి స్కూల్‌లో 50 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువైన నోట్‌బుక్కులను అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కనకరాజు, ప్రైమరీస్కూల్ హెచ్‌ఎంలు సుజాత, సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్లు రఫీ, షబ్బీర్, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు**

కొండపాక(గజ్వేల్): కలెక్టరు ప్రశాంత్ జీవన్ పాటిల్ జన్మదినం సందర్భంగా కుకునూరుపల్లి మండలం మంగోల్ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలపై కొనియాడారు.

◆ **ఆర్థిక సాయం**

సిద్దిపేటకమాన్: డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికుడికి ఓ హోంగార్డు సాయం అందించాడు. ఖమ్మం జిల్లా మణుగూర్‌కు చెందిన నరసింహారెడ్డి పని నిమిత్తం సిద్దిపేటకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో తన వద్ద ఉన్న డబ్బులను పోగొట్టుకున్నాడు. ఊరెళ్లడానికి డబ్బులు లేక సిద్దిపేట బస్టాండ్‌లో కూర్చొని ఉండగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు అజ్జు వివరాలు తెలుసుకున్నాడు. రూ.500 బస్సు చార్జీలు అందించి పంపించాడు. విషయం తెలుసుకున్న ఏసీపీ ఫణిందర్, సీఐ రామకృష్ణ హోంగార్డు అజ్జును అభినందించారు.

◆ **పరామర్శ**

మద్దూరు(హుస్నాబాద్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దూల్మిట్ట మండలం జాలపల్లికి చెందిన బందారం ఎల్లయ్య కుటుంబాన్ని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి పరారమర్శించారు. అనంతరం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో మద్దూరు సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, మండల నాయకులు తాళ్లపల్లి బిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఐటీ దాడులు కక్షసాధింపే**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై ఐటీ దాడులు రాజకీయ కక్షసాధింపు చర్య అని బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకుడు సంతోష్ రెడ్డి ఆరోపించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోతున్న పార్టీలు వ్యక్తిగత దాడులకు దిగుతున్నాయన్నారు.

◆ **రైతులను ఇబ్బంది పెడుతూ సంబురాలా?**

బెజ్జంకి(సిద్దిపేట): ధాన్యం డబ్బులు రాక రైతులు ఇబ్బందులు పడుతుంటే నాయకులు సంబురాలు ఎలా చేస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన బెజ్జంకిలో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల పేరుతో అధికారులను తిప్పడంతో పాలన గాడి తప్పిందని, విద్యార్థులు, బీసీలు కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల వద్ద రోజుల తరబడి ఎదురుచూస్తున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, ప్రభాకర్, మల్లేశం, డీవీ రావు, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **సభాస్థలి పరిశీలన**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో శనివారం నిర్వహించే శతాబ్ది ఉత్సవాలకు మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్న సభాస్థలిని శుక్రవారం సిద్దిపేట సీఐ జానకిరాంరెడ్డి పరిశీలించారు. ఆయనతో ఎంపీడీఓ రాము, ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్, బీఆర్‌ఎస్ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, చిలాపూర్ సర్పంచ్ మొండయ్య, నాయకులు లక్ష్మన్, తిరుపతి పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించాలి**

దుబ్బాకరూరల్: పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పద్మనాభునిపల్లి సర్పంచ్ పర్సరాములు అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ 'మన ఊరు మన బడి'తో పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారాయన్నారు. తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనగర్ ఆరెపల్లిలో శుక్రవారం ఆత్మ గౌరవ పాద యాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మ నారాగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో నాయకులు నేరండ్ల భూమాగౌడ్, లక్ష్మీనగర్ మాజీ సర్పంచ్ అగురం కనకారెడ్డి పాల్గొన్నారు.

◆ **కమిటీ నియామకం**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ యూత్ విభాగంను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా సంతోష్‌గౌడ్, సోషల్‌మీడియా అధ్యక్షుడిగా నితిన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా వినయ్‌ను నియమించినట్లు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ తెలిపారు.